



వెలికట్ట ఎక్స్ రోడ్డులో సమ్మె ప్రభావంతో తెరుచుకోని జిన్నింగ్ మిల్లు



చేర్యాల మండలంలో కూలీల కొరతతో చేలలోనే ఉన్న పత్తి

పత్తి రైతుకు తీరని కష్టాలు

రాష్ట్రంలో పత్తి రైతులకు కష్టాలు తీరడం లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొన్నది. వరుస వర్షాలు, కూలీల కొరతతో పత్తి ఏరడం ఆలస్యం కాగా, ఇప్పుడు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠిన నిబంధనల కారణంగా జిల్లాలోని 23 జిన్నింగ్ మిల్లులు సమ్మె బాట పట్టడంతో పత్తి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. సీసీఐ నిబంధనలు సడలించాలని మిల్లర్లు డిమాండ్ చేస్తుండగా, మార్కెట్‌లో తాజా అనిశ్చితి పత్తి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

- సిద్దిపేట కలెక్టరేట్/చేర్యాల, నవంబరు17 (ఆంధ్రజ్యోతి)

సీసీఐ నిబంధనలతో జిన్నింగ్ మిల్లులు సమ్మె బాట

- మిల్లుల బంద్‌తో నిలిచిన కొనుగోళ్లు
- మరోవైపు కూలీల కొరతతో చేలల్లోనే పత్తి
- దిగుబడి తగ్గినా.. అమ్ముకునేందుకు అగచాట్లు
- ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లోకి రైతుల కష్టం!

సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు, కొర్రీల కారణంగా జిన్నింగ్ మిల్లుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా, కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు నమోదు చేసుకుని, స్లాట్ బుకింగ్ చేసుకుంటేనే మిల్లుల్లో అమ్మకాలు జరపడం అనేది రైతులకు ఇబ్బందికరంగా మారింది. జిన్నింగ్ మిల్లులను ఎల్1, ఎల్2, ఎల్ 3, కేటగిరీలుగా విభజించడంతో మిల్లర్లలోనూ భేదాభిప్రాయాలు తలెత్తినట్లు సమాచారం. ఇక యాప్‌లో నమోదు, స్లాట్ బుకింగ్‌తో పాటు, ఎకరానికి కేవలం ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధన రైతులను మరింత కలవరపెడుతోంది. తేమ శాతం విషయంలో కొర్రీలు పెడుతుండటం కూడా మిల్లర్ల అసంతృప్తికి కారణమైంది. ఈ సమస్యలపై మిల్లర్ల విజ్ఞప్తిని సీసీఐ పట్టించుకోకపోవడంతో, మిల్లర్ల అసోసియేషన్ కొనుగోళ్లను నిలిపివేస్తూ నిరవధిక సమ్మెకు దిగింది.

కొన్నది అరకొరే...

జిల్లాలో ఈ సీజన్‌లో 1.07 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దీని ద్వారా దాదాపు 12.86 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే, ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు చేసింది కేవలం 54,389 క్వింటాళ్లే. ప్రైవేట్ వ్యాపారులు మరో 51 వేల క్వింటాళ్లు కొన్నారు. అంటే, దాదాపు 11.81 లక్షల క్వింటాళ్ల పత్తిని రైతులు ఎలా అమ్ముకోవాలనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ సమ్మె ఎప్పుడు ముగుస్తుందో, సీసీఐ నిబంధనలు సడలిస్తుందో లేదోనని పత్తి రైతులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

చేలల్లోనే పత్తి.. వేధిస్తున్న కూలీల కొరత

పత్తి రైతులను కష్టాలు చుట్టుముట్టడానికి మరో ప్రధాన కారణం కూలీల కొరత. ఒకవైపు యూరియా కొరతతో ఆర్థికంగా భారం, అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది అన్న బాధలో రైతులున్నారు. చేతికందే దశలో కురిసిన వర్షాల వల్ల పత్తి ఏరడానికి వీలుపడలేదు. ఇటీవలి కాలంలో వరి, మొక్కజొన్న కోతలు కూడా మొదలవడంతో, ఆయా పనులకు కూలీలు మళ్లారు. దీంతో పత్తి సేకరణకు స్థానిక కూలీలు అందుబాటులో లేక పొరుగు మండలాల కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిలో పత్తి ఏరినందుకు రూ.15 చెల్లిస్తామని చెబుతున్నా, వరి కోతలు వంటి ఇతర పనుల కారణంగా కూలీలు నిరాసక్తత కనబరుస్తున్నారు. ఫలితంగా, పూర్తిస్థాయిలో పత్తిని ఏరలేక చేలల్లోనే దూదిపూలు మిగిలిపోయాయి.

వ్యాపారుల ఆగడాలు పెరిగే ప్రమాదం

మిల్లుల బంద్‌తో కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు

మిగతా 8లో...



చేనేత.. ఎదురీత

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కార్మికులు

- వృత్తిని కోల్పోయి.. ఉపాధి లేక విలవిల
- ఇంకా మూస పద్ధతుల్లోనే పరిశ్రమ
- కొత్త ఒరవడికి అందని ప్రోత్సాహం
- అప్పుల ఊబిలో దుబ్బాక చేనేత సొసైటీ

గొల్లభామ చీరలు, తెలియా రుమాలు, దుప్పట్లు, తువ్వాళ్లు వంటి చేనేత ఉత్పత్తులకు సిద్దిపేట, దుబ్బాక ప్రఖ్యాతి గాంచాయి. గొల్లభామ డిజైన్‌కు సిద్దిపేట పేటెంట్ హక్కును కూడా పొందింది. ప్రపంచాన్ని మెప్పించిన మన చేనేత రంగం.. ప్రస్తుతం సంక్షోభంతో కుదేలైంది. అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఇటు పెట్టుబడి లేక అటు రుణం దొరకక కష్టాలతో ఎదురీదుతోంది. దుబ్బాక నేత కుటుంబాలు వృత్తిని కోల్పోయి, ఉపాధి కరువై తల్లడిల్లుతున్నాయి. పాతపద్ధతులను వీడకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో మగ్గాలు మూగబోతున్నాయి.

7





సిద్దిపేట పట్టణంలోని ఉమాపార్వతి కోటి లింగేశ్వర ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

కార్తీక వెలుగులు

చివరి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. సిద్దిపేట పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లోని ఉమా పార్వతీ కోటి లింగేశ్వర ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ మహా మండపంలో ఉత్సవమూర్తుల ఎదుట పవిత్ర కార్తీకమాస బహుళ త్రయోదశిని పురస్కరించుకొని శివ సహస్రనామ పారాయణంతో పాటు శివనామ సంకీర్తనగావించి నంది వాహనంపై శివుడి ఆకృతిని రచించి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

- సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ కొమురవెల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి)



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో..







మల్లన్న కల్యాణ, బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే పల్లా, అధికారులు

ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

- కొమురవెల్లి మల్లన్న కల్యాణంపై మంత్రి సురేఖ సమీక్ష
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆలయాధికారులు హాజరు

కొమురవెల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆలయాధికారులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.. ఆలయ పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు, భక్తులకు వైద్య సేవలు, రాజీవ్ రహదారిపై భక్తుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ఏర్పాటు, ఆలయానికి వచ్చే రోడ్ల మరమ్మతులపై మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి.. స్వామివారి కల్యాణం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 14న స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం స్వామివారి కల్యాణం, బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను మంత్రి, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో శ్రీనివాస్, ధర్మకర్తలు జయప్రకాశ్ రెడ్డి, కొమురయ్య, మోహన్ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నకు బంగారు లింగంకాయ బహుకరణ

మల్లికార్జున స్వామివారి అలంకరణ నిమిత్తం 20 గ్రాముల బంగారు లింగంకాయను హైదరాబాద్‌కు చెందిన ధనకొండ శివకుమార్ దంపతులు సోమవారం ఆలయాధికారులకు, అర్చకులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు, అర్చకులు రసీదును అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలను శివకుమార్ దంపతులకు అందజేశారు.

ఈసారి ఉత్సవ కమిటీతో కాలక్షేపమేనా?

- మల్లన్న ఆలయ కమిటీ నియామకానికి గ్రహణం
- చైర్మన్ లేకుండానే మళ్లీ బ్రహ్మోత్సవాలా?
- అమ్మవార్ల స్వర్ణ కిరీటాలు కల్యాణం నాటికైనా అందేనా?

7

చలి@7.1


- కోహీర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి జిల్లాలో 33 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్

కోహీర్/మెదక్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలకు తోడు చలిగాలుల తీవ్రతకు పల్లెలు వణుకుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో సోమవారం 7.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలోని బేగంపేట్‌లో 8.6 డిగ్రీలు, మెదక్ జిల్లా నార్లాపూర్‌లో 9.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 33 ప్రాంతాల్లో సోమవారం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదైంది.

మూడు రోజులు చలిగాలులు

ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న చలిగాలులు మరో మూడు రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత వివరాలు..



సంగారెడ్డి జిల్లా సదాశివపేట 7.9, న్యాల్‌కల్ 8, ఝరాసంగం 8.1, మొగుడంపల్లి 8.2, నల్లవల్లి 8.8, అల్గోల్ 8.6, సత్వార్ 8.6, మల్‌చేల్మ 9.1, దిగ్వాల్ 9.3, కడ్పల్ 9.5, జహీరాబాద్ 9.5, పుల్కల్ 9.8, కంగ్టి 9.8, నిజాంపేట్ 9.9, రాయికోడ్ 10.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో నార్లాపూర్ 9.3, సర్దన 9.3, వాడి 9.3, దామరంచ 9.4, వెల్దుర్తి, హవేళీఘణపురం 9.5, నాగపూర్ 9.6, రామాయంపేట 9.7, మనోహరాబాద్ 9.7, కాగజ్ మద్దూర్ 9.7, దొంగల ధర్మారం 9.7, కొల్చారం 9.9, శివనూరులో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో 8.3, బేగంపేట 8.6, అక్బర్‌పేట-భూంపల్లి, పోతిరెడ్డిపేట 8.8, మార్కూక్, అల్బిపూర్ 9.2, అంగడి కిష్టాపూర్ 9.4, కొండపాక 9.5, నంగనూర్ 9.8, వర్గల్, గౌరారం 9.9, మునిగడప 10.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శ్రేష్ఠ భారత్‌గా నిలవాలి

- 'ఏక్తా ర్యాలీ'ని ప్రారంభించిన ఎంపీ రఘునందన్‌రావు
- ఐక్యతా మార్చ్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత



ఏక్తా ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు, నాయకులు, అధికారులు



సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏక్తా ర్యాలీలో విద్యార్థులు, యువత కదం తొక్కారు. చేయి చేయి కలిపి ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. సోమవారం "మై భారత్" ఆధ్వర్యంలో చేపట్టిన ఏక్తా ర్యాలీకి విశేష స్పందన వచ్చింది. పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలతో పాటు పలువురు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు సాగిన ర్యాలీని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. కొంతమంది దేశ సమగ్రతను దెబ్బతీయాలని, ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. దేశ యువత ముందుకురావాలని, 2047 వరకు వికసిత భారత్‌గా తీర్చిదిద్దడానికి యువత ముందుకు రావాలన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీవైఎస్‌వో వెంకటనర్సయ్య, యువజన అధికారి రంజిత్ రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, అర్బన్ మండల విద్యాధికారి రాజప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీ స్పాట్ అడ్మిషన్స్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో మంగళవారం స్పాట్ అడ్మిషన్స్ చేపట్టనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీతో పాటుగా రెండు సెట్ల జీరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. అడ్మిషన్ లభించిన విద్యార్థులు వెంటనే ట్యూషన్ ఫీజు చెల్లించాలని చెప్పారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరే విద్యార్థులకు స్కాలర్‌షిప్ లభించదని ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు.



వైభవంగా కల్యాణ మహోత్సవం

వర్గల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం ఆలయం వద్ద రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 7:30 నిమిషాలకు స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త తెలిపారు.

ప్రజల జీవన స్థితి గతులపై అధ్యయనం

రాయపోల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన స్థితి గతులను అధ్యయనం చేయడానికి పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంకశాఖ అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ సోమవారం రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లిలో ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలు, గ్రామాల్లో ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వేలో భాగంగా చిన్నమాసాన్‌పల్లిలో ప్రారంభించామని తెలిపారు. మొదట సాధారణ వివరాలతో సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్ ద్వారా కొన్ని కుటుంబాలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన కుటుంబాలను మూడునెలలకు ఒకసారి పూర్తి సర్వే చేసి వివరాలను నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జమ్లానాయక్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, అంగన్వాడీ టీచర్ స్వప్న, ఆశావర్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వడ్ల కుప్పను ఢీకొన్న ఆటో..
బోల్తాపడి డ్రైవర్ మృతి

● రైతుపై కేసు నమోదు


అహ్మద్ హుస్సేన్ మృతదేహం

అల్లాదుర్గం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఆటో ఢీకొని బోల్తా పడటంతో డ్రైవర్ మృతిచెందిన సంఘన ఆది వారం రాత్రి మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంక రంపేట మండలం కోలపల్లికి చెందిన అహ్మద్ హుస్సేన్(57) ఆటో నడి పిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం కొందరు ప్రయా ణికులను అల్లాదుర్గంలోని రేణుకామాత ఆలయానికి తీసుకువచ్చి తిరిగి పెద్దశంకరంపేట వైపు రాత్రి వేళలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలం లోని రాంపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ధాన్యం కుప్పను ఆటో ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ అహ్మద్ హుస్సేన్ అక్కడిక్కడే మృతిచెందాడు. అహ్మద్ హుస్సేన్ కుమారుడు మహ్మద్ జావిద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. నిర్లక్ష్యంగా రోడ్డుపై ధాన్యం నిల్వ ఉంచిన రాంపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని రైతు..


మన్నె భిక్షపతి(ఫైల్)

ములుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మట్టిలోడ్‌తో వస్తున్న టిప్పర్ ద్విచక్రవాహ నాన్ని ఢీకొనడంతో దీనిపై ఉన్న రైతు మృతి చెందిన సంఘటన ములుగు మండల పరి ధిలోని బస్వాపూర్ - కొక్కొండ రోడ్డులో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన రైతు మన్నె భిక్షపతి(58) సోమవారం ఉదయం వ్యవ సాయ పనుల నిమిత్తం తన టీవీఎస్ ద్విచక్ర వాహనంపై కొక్కొండ గ్రామానికి బయలుదేరాడు. బస్వాపూర్-కొక్కొండ రోడ్డులో మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్రవా హనాన్ని ఢీకొనడంతో భిక్షపతి సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. భిక్ష పతికి భార్య అంజమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

అప్పుల బాధతో పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య


మాదారం ఎల్లం(ఫైల్)

చేగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక పారిశుధ్య కార్మి కుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండల పరిధిలోని పెద్ద శివనూర్ గ్రామంలో సోమ వారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మాదారం ఎల్లం(45) వ్యవసాయం చేసుకుంటూనే, పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఎల్లం చెయ్యి విరిగిపోయింది. డబ్బులు లేక ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఇంటి కోసం చేసిన అప్పు తీర్చలేకపోయాడు. మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లంకు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

దొంగతనం నెపం మోపారని మేకల కాపరి..

జోగిపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం నెపం మోపారని ఆత్మహత్యాయత్నం చేసిన మేకల కాపరి చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామంలో చేటుచేసుకున్నది. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల మేరకు.. తాలేల్మ గ్రామానికి చెందిన కుమ్మరి జోగయ్య(45) మూడేళ్లుగా డాకూరులోని నర్సింహారెడ్డి వద్ద మేకలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, జోగయ్యపై మేకలను దొంగలించాడని ఆరోపిస్తూ గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తనపై అకారణంగా నేరం మోపారని, మనస్తాపానికి గురై నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జోగయ్య సోమవారం మృతిచెందాడు. భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు.

దుబాయ్‌లో ఆకునూరు వాసి మృతి


షేక్ మదర్(ఫైల్)

చేర్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో గుండెపోటుతో మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం ఆకునూరు గ్రామ శివారు కాశెగుడిసెలుకు చెందిన షేక్ మదర్(32) పదేళ్లుగా దుబాయ్‌లో కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందాడు. కొద్ది రోజుల క్రితం అక్కడే గుండెనొప్పి రావ డంతో ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

327 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చె రు పరిధిలో వేర్వేరు ఘటనల్లో మొత్తం 327 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. పౌరసరఫరాల విభాగం ఉప తహసీల్దార్ అనూప్ దేవానంద్ వివరాల ప్రకారం.. పటా న్‌చెరు పరిధి ఇస్నాపూర్ నుంచి జహీరాబాద్ వైపునకు రేషన్ బియ్యం తీసుకుని వెళ్తున్న లారీని రామచంద్రపురం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఈ లారీలో మొత్తం 75 బస్తాల్లో 290 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండగా, పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో డ్రైవర్ నీరాబాయిపై కేసు నమోదు చేశారు. మరోఘటనలో ఐడీ ఏబొల్లారం జ్యోతినగర్ నుంచి 80 బస్తాల్లో 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా, స్థానికులు పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోను పట్టుకుని బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఆటోను స్వాధీనం చేసుకుని డ్రైవర్ రాజు, ఆటో యజమాని జైపాలలపై కేసు నమోదు చేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి


ఇందిరాబాయి (ఫైల్)

అల్లాదుర్గం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గంలో ఓ శతాధిక వృదురాలు అనారో గ్యంతో సోమవారం మృతి చెందారు. పట్టణానికి చెందిన తాండ్లే ఇందిరాబాయి (103) వారం రోజులుగా అస్వస్థకు గురి కాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహింప చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఇందిరాబాయికి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి పూజలు


అభిషేకం చేస్తున్న ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కొత్తబస్టాండ్ సమీపంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీచంద్ర సోమవారం పూజలు చేశారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలోని శివ లింగానికి ఆమె అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపం వెలిగించారు. కార్తీకమాసం చివరి సోమవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు మఠం శివకాంత్ స్వామి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి.

వృద్ధులను చిన్నచూపు చూడొద్దు

● సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల పట్ల చిన్నచూపు ధోరణి అవలంభించకుండా, వారి బాగోగులు పట్టించుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని గ్రేస్ వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. న్యాయపరమైన విషయాల్లో ఏమైనా సలహాలు, సూచనలు అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మెదక్ సీఎస్ఐలో 'గంట' ప్యానల్ విజయం


గంట సంపత్

మెదక్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ మహాలయ చర్చి (సీఎస్ఐ) కోశాధికారి పోస్టు కోసం జరిగిన ఎన్నికల్లో గంట సంపత్ ప్యానెల్ ఘన విజయం సాధించడంతో సోమవారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం మూడు ప్యానెళ్లు పోటీ చేశాయి. మూడు ప్యానళ్లలో 60 మంది సభ్యులు పోటీ చేయగా గంట సంపత్ ప్యానెల్ 20 సభ్యులకుగాను 13 మంది సభ్యులు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కోశాధికారిగా విజయం సాధించిన గంట సంపత్ మాట్లాడుతూ విశ్వాసులకు సమాన హక్కులు, చర్చి ఆస్తుల పరిరక్షణ, పారదర్శకతతో కూడిన పరిపాలన లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

సంయుక్త బృందాల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పంటల సందర్శన


పంటను పరిశీలిస్తున్న సంయుక్త బృందం

చేగుంట, నంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుక్మాపూర్‌లో సంయుక్త బృందాల క్షేత్ర స్థాయి అధికారుల కమిటీ పంటపొలాలను సోమవారం సందర్శించారు. ఈ కమిటీ పంటలను పెరుగుదల దశ, చీడపీడల ప్రభావం, వరిలో పిలకల సంఖ్య, ప్రభావం చూపే కీలక అంశాలను పరిశీలించారు. కమిటీ బృందం నమూనాలను సేకరించింది. రైతుల ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. పరిశీలించిన వారిలో డీఏవోతో పాటు విత్తనశుద్ధి సంస్థ సహాయ సంచాలకులు ఎంశివకుమార్, విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ అతుల్ కుమార్‌జైన్, సహాయ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, రైతు విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పది మంది ఎంపిక

మెదక్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని గుల్షన్ క్లబ్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-19 బాలబాలకలకు నిర్వహించిన పోటీల్లో 30 మంది క్రీడాకారులు పాల్గొనగా 10 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ సంఘం కార్యదర్శి డా.ప్రభుకుమార్ తెలిపారు. విజేతలకు మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్ రావు బహుమతులు అందజేశారు. క్లబ్ సభ్యులు, పీడీ ఆనందం, హనుమంతు, వినోద్‌కుమార్, కోచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట ఫంక్షన్‌హాల్‌లో చోరీ

● సౌండ్ బాక్స్‌లు, సీసీ కెమెరాలు అపహరణ

నిజాంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శుభకార్యాలు నిర్వహించుకునే ఫంక్షన్‌హాల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. ఫంక్షన్‌హాల్ యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రేణుకామాత ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.2 లక్షల విలువైన సౌండ్‌బాక్స్‌లు, సీసీ కెమెరాలను దొంగిలించారు. వారం రోజుల్లో రెండుసార్లు చోరీ జరిగింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

హుస్నాబాద్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో..

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పట్టణానికి చెందిన చీకోటి ప్రభాకర్ నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లో ఉన్న అర్ధతులం బంగారం, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత.. ఎదురీత



సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నేత కార్మికులు

- వృత్తిని కోల్పోయి.. ఉపాధి లేక విలవిల
- ఇంకా మూస పద్ధతుల్లోనే పరిశ్రమ
- కొత్త ఒరవడికి అందని ప్రోత్సాహం
- అప్పుల ఊబిలో దుబ్బాక చేనేత సొసైటీ
- 13 ఏళ్లుగా సహకార సంఘం ఎన్నికల్లేవ్


దుబ్బాక చేనేత సహకార సంఘం భవనం

దుబ్బాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి మార్కెట్ పోటీ ప్రపంచంలో దేశీయ చేనేత ఉత్పత్తులు మూలన పడుతున్నాయి. దేశీయ వస్త్ర రంగంలో మంచి ఆదరణ ఉన్నప్పటికీ, మార్కెటింగ్‌కు అనుగుణంగా ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోలేకపోవడంతో చేనేత రంగం చిన్నచూపునకు గురవుతోంది. సిద్దిపేట జిల్లాలో మొత్తం 18 చేనేత సహకార సంఘాలు ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అందులో దుబ్బాక చేనేత సహకార సంఘం దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

ఎన్నికలు లేక స్తంభించిన ప్రగతి

చేనేత సహకార సంఘాలకు 13 ఏళ్లుగా (2013 నుంచి) ఎన్నికలు జరగకపోవడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. విధాన నిర్ణయాలు తీసుకునే పాలక మండలి లేకపోవడంతో సహకార సంఘాల పాలన అంతగా అవగాహన లేని అధికారుల చేతుల్లోనే కొనసాగుతోంది. ఆ అధికారులకు కీలక నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు లేకపోవడంతో మార్కెట్‌ను అందుకోలేకపోతోంది. గిరిగీసిన గీతలోనే నేతన్న మెదలాల్సిన పరిస్థితి నెలకొంది.


రాట్నంపై కండెలు చుడుతున్న మహిళలు

వేతనంలో జాప్యం..

పాలకమండలి లేకపోవడంతో నాలుగేళ్లుగా నేత కార్మికుల వేతనాలపై అధికారుల నిర్ణయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాలన్నా జాప్యం తప్పడంలేదు. దుబ్బాక చేనేత సహకార సంఘంలో నేసిన టీసీ షర్టింగ్‌కు టెస్కో మీటరుకు రూ.36 చెల్లిస్తుంది. రోజుకు కేవలం 8 మీటర్లు మాత్రమే నేత కార్మికుడు నేయగలుగుతాడు. ఇందులో నుంచి అధికారులు కేవలం రూ.200 మాత్రమే చెల్లించగలుగుతారు. కార్మికుడికి ఈ దినసరి వేతనం కూడా సక్రమంగా అందడం లేదు.

వృత్తికి దూరమవుతున్న యువతరం

నాలుగు దశాబ్దాల క్రితం దుబ్బాకలోనే సుమారు 15 వేల మంది కార్మికులు జీవనోపాధి పొందేవారు. ఇప్పుడు సహకార సంఘంలో 1600 మంది సభ్యులు ఉంటే, వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు 200 మంది మాత్రమే ఉన్నారు. అందులో 188 మంది 60 ఏళ్ల లోపు వారే. అంటే కొత్త తరం చేనేత వృత్తికి రావడంలేదు. ప్రోత్సాహం లేకపోవడం వల్ల జిల్లాలో 2017-24 మధ్యలో కేవలం ఏడుగురు మాత్రమే వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. ప్రస్తుతం కేవలం 57 మంది మాత్రమే రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రాంతం చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ లేకపోవడానికి గల కారణాలను ప్రభుత్వం గుర్తించి, పరిశ్రమలకు తక్షణమే జీవం పోయాలని నేతన్నలు కోరుతున్నారు.

నూతన పద్ధతులకు నోచుకోని మగ్గాలు

మూసపద్ధతులు వీడి, విధాన నిర్ణయాలు తీసుకునేవారు లేకపోవడంతో మార్కెట్‌కు అనుకూలంగా వస్త్రాలను తయారు చేసే ప్రోత్సాహం కరువైంది. గతంలో అధునాతన లినిన్ వస్త్రాలను నేసింది. కానీ పాలకమండలి లేకపోవడంతో అధికారులు పాతపద్ధతిలోనే వస్త్రాలను నేయాల్సి వస్తుంది. పాతపద్ధతిలో ఒక మగ్గం పంచ్‌కార్డు, వార్పిన్ కట్టడం మార్చాలంటే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. దీనికి 15 రోజులు పడుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి ఎలక్ట్రానిక్ జకార్డ్ వినియోగంలోకి రావాలి. దీని ద్వారా పెన్‌డ్రైవ్‌తో డిజైన్ మార్చవచ్చు. సుమారు రూ.8 లక్షలు అయ్యే ఈ ఖర్చులో కేంద్ర ప్రభుత్వం హెచ్‌హెచ్ఎస్ (హస్తకర్గ సమ్రద్ధన్ సహాయత) ద్వారా 90 శాతం అందిస్తుంది. మిగతా 10 శాతం కార్మికులు చెల్లించాల్సి ఉంటుంది. కార్మికులు అంత మొత్తం చెల్లించలేని పరిస్థితిలో.. పాలకమండలి ఉంటే రుణాన్ని సమకూర్చి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే బాగుంటుందని జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా పాలకమండలి లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు అలాగే మిగిలాయి. జిల్లాలో పది జకార్డ్‌లను (960 హుక్స్ ఉండే) ప్రతిపాదించారు. ఇది టైఅండ్‌డై కావడంతో ప్రాసెసింగ్‌తో కూడా అవసరం ఉండదు. డిజైన్ మార్చడానికి పంచ్‌కార్డు అవసరం ఉండదు. దీని వల్ల రూ. 40 వేల వరకు ఖర్చు ఆదా అవుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇలాంటి అధునాతన పద్ధతులను అందిపుచ్చుకునే అవకాశం లేకుండా పోయింది.

రుణ ఊబిలో దుబ్బాక సహకార సంఘం

దుబ్బాక అంటే గతంలో ఆత్మహత్యలు, ఆకలిచావులతో తల్లడిల్లిన చేనేతల బతుకులు గుర్తొస్తాయి. బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వైనం కనిపిస్తుంది. ఈ పరిస్థితిని చూసిన అప్పటి రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావు 2018లో దుబ్బాక చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం షూరిటీపై రుణం అందిస్తామని హామీ ఇచ్చారు. అధునాతనమైన లినిన్ వస్త్రాలను మార్కెట్‌లోకి తెచ్చేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.2 కోట్ల రుణం అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా 2019లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ద్వారా రూ.52 లక్షలు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) నుంచి పొందారు. అయితే, మిగతా రుణం కోసం ప్రయత్నించగా, ఎస్ఎఫ్‌సీ అధికారులు దుబ్బాక చేనేత సొసైటీ పేరుతో డీసీసీ బ్యాంకులో రూ.42 లక్షలు, ఎస్‌బీఐ రూ.9 లక్షలు ఉన్నాయని, వాటిని చెల్లిస్తేనే కానీ రుణం ఇవ్వమబోమని నిరాకరించారు. దీంతో వచ్చిన రూ.52 లక్షల రుణం బకాయిల చెల్లింపుకే సరిపోయింది. 2019 దుబ్బాక ఉప ఎన్నికల తర్వాత ప్రభుత్వం దుబ్బాకపై శీతకన్ను వేయడంతో ఎస్ఎఫ్‌సీ నుంచి మరింత సహకారం అందలేదు. తీసుకున్న రుణంపై వడ్డీ పెరిగి రూ.1 కోటి 10 లక్షలుగా పేరుకుపోయింది. అంతేగాక సిద్దిపేట ప్రాజెక్టు సొసైటీలో రూ.17 లక్షలు, ఇర్కోడు సొసైటీలో రూ.22 లక్షలు బకాయిలు ఉండటంతో.. నూతన పెట్టుబడి పెట్టి సంఘాలను బలోపేతం చేయాలనుకున్నా రుణం పుట్టడంలేదు. గతంలో ప్రభుత్వాలు రుణాలను మాఫీ చేస్తామన్న హామీ కూడా అమలుకాలేదు. దీంతో దుబ్బాక సొసైటీ ఆదాయం లేక, బకాయిలు చెల్లించలేక దీనవస్థలో ఉంది.

చేనేతలకు సహకారం అందించాలి

– సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాస్కర్



కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత బోర్డు, హ్యాండిక్రాఫ్ట్ బోర్డు, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్, హౌస్ కమ్ వర్క్ షెడ్ వంటి పథకాలను రద్దు చేసింది. కేంద్రం ముడి సరుకులైన రంగులు, రసాయనాలతో పాటు చేనేత చీరలపై జీఎస్టీ విధించి చేనేత పరిశ్రమను చావు దెబ్బ తీసింది. రద్దు చేసిన పథకాలను తిరిగి పునరుద్ధరించాలి. ముడి సరుకులు, వస్త్రాలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేసి చేనేత కళను, పరిశ్రమను ఆదుకొని, కార్మికులకు ఉపాధి కల్పించాలి.

సమస్యల వాణి

మా సమస్యలు తీర్చండి అంటూ బాధితులు ప్రజావాణిలో తమ గోడు వినిపించారు. సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య, మెదక్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేటలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సంగారెడ్డి, మెదక్‌లలో జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలోనూ ప్రజావాణి జరిగింది.

మెదక్‌లో 76 అర్జీలు.. సంగారెడ్డిలో 25, సిద్దిపేటలో 160


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని మొత్తం 25 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పట్టాభూములు ప్రభుత్వ భూములుగా..

గుమ్మడిదల: మండలంలోని అనంతారం గ్రామ సర్వే నంబర్ 173, 174 పట్టాభూములను ప్రభుత్వ భూములుగా నమోదు చేశారని బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. అధికారులు అవగాహన లేకుండా తీసుకున్న నిర్ణయాలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు.

పారదర్శక పాలన కోసమే..

మెదక్ అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పారదర్శక పాలనే కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 96 అర్జీలు వచ్చాయి. అందులో భూభారతికి సంబంధించి 37, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 8, పింఛన్లు 7, ఇతర 35 దరఖాస్తులు ఉన్నాయి. అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో.. భారీగా అర్జీదారులు

సిద్దిపేట నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 160 అర్జీలు వచ్చాయి. వీటిని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ స్వీకరించారు. ఎక్కువగా భూ సమస్యలు, ఇళ్లు, పింఛన్ల దరఖాస్తులు వచ్చాయి. డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీల ఆధ్వర్యంలో..

సంగారెడ్డి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకని పక్షంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజావాణి సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

మెదక్ అర్బన్: పోలీస్ ప్రజావాణిలో భాగంగా మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. 9 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.

అక్కాచెల్లెళ్లపై అలిగి సోదరుడి అదృశ్యం

పటాన్‌చెరు నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గృహప్రవేశం జరిగిన మరుసటి రోజు అక్కాచెల్లెళ్లపై అలిగి సోదరుడు అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగిలో నివాసం ఉంటున్న రామచందర్‌రావు ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. ఈనెల 15న గృహప్రవేశం చేసుకున్నారు. 16వ తేదీన తన అక్కాచెల్లెళ్లకు సరైన మర్యాద జరగలేదంటూ రామచందర్‌రావుతో గొడవ జరిగింది. దీనిపై అలిగి స్కూటీ నడుపుకుంటూ బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. భార్య సంతోషి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అన్న మందలించాడని చెల్లి..


గాయత్రీ కుమారి(ఫైల్)

పటాన్‌చెరు నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అబ్బాయిలతో ఫోన్‌లో ఎందుకు మాట్లాడుతున్నావంటూ అన్న మందలించినందుకు చెల్లి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు జేపీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గాయత్రీకుమారి(20) మెహదీపట్నం ఫుల్లారెడ్డి కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. కొన్ని రోజులుగా అబ్బాయితో ఎక్కువగా ఫోన్ ఎందుకు మాట్లాడుతున్నావంటూ అన్న మేఘనాథరాం తీవ్రంగా మందలించారు. దీనిపై ఆగ్రహించి ఫోన్‌లో సిమ్ కార్డు ఇంట్లోనే వదిలి ఈనెల 15వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించలేదు. అన్న మేఘనాథరాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఈసారి ఉత్సవ కమిటీతో కాలక్షేపమేనా?

● మల్లన్న ఆలయ కమిటీ నియామకానికి గ్రహణం
● చైర్మన్ లేకుండానే మళ్లీ బ్రహ్మోత్సవాలా?



కొమురవెల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయానికి పూర్తిస్థాయి పాలకమండలి నియామకానికి గ్రహణం వీడడం లేదు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతూ, సంవత్సరానికి సుమారు రూ.22 కోట్ల ఆదాయం కలిగి ఉన్నా.. పూర్తిస్థాయి పాలకమండలిని నియమించకపోవడం పట్ల కాంగ్రెస్ నాయకులు నిరాశకు లోనవుతున్నారు.

పూర్తిస్థాయి పాలకవర్గం కొలువుదీరేనా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మొదటిసారి 20 మందితో పునరుద్ధరణ కమిటీని ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ కమిటీ పదవీ కాలం గత సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన ముగిసింది. ఆ తర్వాత రెగ్యులర్ కమిటీ కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తుల గడువును పొడిగించగా, 82 మంది ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, చైర్మన్ లేకుండా కేవలం ఎనిమిది మందితో ఒక సంవత్సరం పాటు కొనసాగే రెగ్యులర్ కమిటీని ప్రభుత్వం నియమించింది. వాస్తవానికి ప్రధానార్చకుడిని కలుపుకుని 15 మందితో కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా, ప్రధానార్చకుడిని ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కలుపుకుని ఎనిమిది మందితోనే పాలకమండలిని ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ సారైనా చైర్మన్‌తో కూడిన పూర్తిస్థాయి పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తారా అని పలువురు చర్చించుకుంటున్నారు. వచ్చే నెల 14న కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో ఇప్పుడున్న వారినే కొనసాగిస్తూ జీవో విడుదల చేస్తారా, లేక నూతనంగా పాలకవర్గాన్ని నియమిస్తారా అనేది వేచి చూడాలి. ఈ విషయంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల్లోనే నిరాశ వ్యక్తమవుతోంది.

అభివృద్ధి పనుల్లో అలసత్వం

ఆలయానికి చైర్మన్‌తో కూడిన పూర్తిస్థాయి పాలకవర్గం లేకపోవడంతో ఆలయాభివృద్ధి పనులు ఏళ్లుగా మందకొడిగా సాగుతున్నాయి. ఆలయానికి సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఒక్కొక్కరూ రెండు, మూడు విభాగాలకు ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇటు పాలకవర్గం లేకపోవడం, అటు సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల ఆలయ అభివృద్ధి కుంటుపడుతోంది. మరో నెల రోజుల్లో స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాలకవర్గం కొలువుదీరేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అమ్మవార్ల స్వర్ణ కిరీటాలు కల్యాణం నాటికైనా అందేనా?

గత ప్రభుత్వ హయాంలో అమ్మవార్లకు స్వర్ణ కిరీటాలు తయారు చేయిస్తామని అప్పటి మంత్రులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా అమ్మవార్లు మేడలమ్మ, గొల్లకేతమ్మకు బంగారు కిరీటాలు తయారు చేయిస్తామని తెలిపారు. అయితే, ఇప్పటివరకు స్వర్ణ కిరీటాల తయారీపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వచ్చే నెల 14న జరగనున్న మల్లన్న కల్యాణం నాటికైనా అమ్మవార్లకు స్వర్ణ కిరీటాల ధారణ జరిగేలా చూడాలని, ఈ విషయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



యజమాని మరణిస్తే రూ.20 వేలు

● జాతీయ కుటుంబ ప్రయోజన పథకంతో భరోసా

తెలుసుకుందాం

అక్కన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి కొంచెం సాయంగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకంను ప్రారంభించింది. ఇది మొదలై ఎనిమిదేళ్లు కావస్తున్నా బాధిత కుటుంబాలకు అవగాహన లేకపోవడంతో సాయం కోసం దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారు.

ఈ పథకం ఎవరికి ఉపయోగం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబంలోని పెద్ద చనిపోతే సంబంధిత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుంటే రూ.20 వేల సహాయం అందుతుంది. కుటుంబంలోని వితంతు, అవివాహ కుమార్తెకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. కుటుంబ పెద్ద 18-60 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి, సాధారణ, ప్రమాదవశాత్తు మృతి చెందితే, మృతిచెందిన రెండేళ్లలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలి.

ఇలా దరఖాస్తు చేయాలి

ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి మృతిచెందిన వ్యక్తి సంబంధీకులు వారి కుల ధృవీకరణ పత్రం, ఆదాయం రూ.60 వేలకు మించకుండా ఉండాలి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతా తీసుకెళ్లి మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలి. అట్టి దరఖాస్తులను పైఅధికారులకు పంపిస్తే పరిశీలన అనంతరం లబ్ధిదారుల ఖాతాలోకి రూ.20 వేలు జమచేస్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైకి వచ్చిన దుకాణాల తొలగింపు

కొండపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి కమాన్ వద్ద రోడ్డుపైకి వచ్చిన దుకాణాలను పోలీసులు సోమవారం తొలగించారు. సిద్దిపేట-హైదరాబాద్ రాజీవ్ రహదారిపై కొమురవెల్లి కమాన్ వద్ద గల బస్టాండ్ కనిపించకుండా చిరు వ్యాపారులు తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారం చేస్తున్నందున ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా, ఇటీవల పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ ఈ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్ గా గుర్తించారు. సీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌లు ఆ ప్రాంతాన్ని సందర్శించి, చిరు వ్యాపారులతో మాట్లాడి అక్కడి నుంచి బండ్లను తొలగించారు. అంతే కాకుండా బస్టాండ్ ముందు డోజర్ సహాయంతో చదును చేపించారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.


రోడ్డుపై ఉన్న దుకాణాలు తొలగింపు

పఠనాసక్తి పెంచుకోవాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులకు వేర్వేరుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేడం లింగమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తకాలు మనిషి ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చిత్తారి రవీందర్, మహేందర్, రచయిత ముక్కెర సంపత్ కుమార్, గంథ్రపాలకులు కే రాజు, దాసరి రాజు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు వ్యక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ డా.వీరబత్తిని మనోహర్, కలీమ్ మోహినుద్దీన్, కె.కృష్ణయ్య, ఎన్. సత్యనారాయణ రెడ్డి, డా. దాసు, డా. హరిబాబు, ప్రభాకర్, వెంకటలక్ష్మి, అంజయ్య, జరీనా పాల్గొన్నారు.

హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గజ్వేల్ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వచ్చిన రోజే ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లోని బీసీ హాస్టల్‌లో సోమవారం జరిగింది. వర్గల్ మండలం తునికి బొల్లారం గ్రామానికి చెందిన మధుప్రియ గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లోని బీసీ బాలికల హాస్టల్‌లో ఉండి ఆరో తరగతి చదువుతోంది. ఇటీవల ఇంటికి వెళ్లిన ఆమెను సోమవారం ఆమె నాన్నమ్మ హాస్టల్‌కు తీసుకువచ్చి వదిలి వెళ్లింది. ఆమె వెళ్లిన కొద్దిసేపటి తర్వాత మధుప్రియ బాత్‌రూంలు శుభ్రం చేసేందుకు ఉపయోగించే డొమెక్స్ తాగినట్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో వారు హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి చెప్పారు. వారు వెంటనే స్పందించి విద్యార్థిని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతోంది. అయితే, విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

కేజీబీవీకు స్వీపర్ పోస్టనకు దరఖాస్తులు

కొండపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండపాక కేజీబీవీ బాలికల హాస్టల్లో స్వీపర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు . దీనికి అర్హత ఏడో తరగతి ఉత్తీర్ణత ఉండాలని 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 18 నుంచి 20వ తేదీ లోపల కేజీబీవీ బాలికల హాస్టల్ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు సీసీ కెమెరాలకు రీచార్జ్

సిద్దిపేట, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని పనిచేయని సీసీ కెమెరాలు... జాతీయ రహదారిపై అలంకారప్రాయం అనే రెండు రోజుల క్రితం ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనానికి పోలీసులు స్పందించారు. సీసీ కెమెరాలను ఇప్పించిన దాతకు పోలీసులు ఫోన్ చేసి 300 రూపాయాలతో రీచార్జ్ చేయించారు. ఇదేవిషయంపై మిరుదొడ్డి ఎస్సైని వివరణ కోరగా మా జీతాలనుంచి సీసీ కెమెరాల రీచార్జ్ ఎందుకు చేస్తామని చెప్పడం గమనార్హంగా మారింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడే యువజన ఉత్సవాలు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో నేడు ఉదయం 11 గంటలకు యువజన కళా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు, అనధికారులతో పాటు సుమారు జిల్లాలోని 400 మంది కళాకారులు హాజరుకానున్నట్లు చెప్పారు. పోటీలు వ్యక్తిగత విభాగాలతో పాటు సామూహిక అంశాలలో నిర్వహించనున్నట్లు, 15 సంవత్సరం నుంచి 29 సంవత్సరాలలోపు వారై ఉండాలని ఆయన అన్నారు. ఆసక్తి గల ఔత్సాహిక కళాకారులు నేరుగా విపంచి కళానిలయంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారిని అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి


కొండపాక ఉన్నత పాఠశాలలో సభ్యత్వం అందజేస్తున్న రామస్వామి

కొండపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కే.రామస్వామి పేర్కొన్నాడు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యారంగ సమస్యలు ఉపాధ్యాయుల సభ్యత్వాల సేకరణలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఈడీ టీటీసీ చేసిన తర్వాత డీఎస్సీలో పాసై అనేక సంవత్సరాలు గడిచిన తర్వాత టెట్ రాయడం అనేది సరైన విధానం కాదన్నారు. దాని నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. విద్యారంగ సమస్యలను ఉపాధ్యాయుల సమస్యలను పక్క తోవ పట్టించడానికే ప్రభుత్వాలు టెట్ తీసుకొస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు మారిన పాలకుల విధానాలలో ఎలాంటి మార్పులు కనిపించడం లేదని, అనేక వ్యత్యాసాలతో పలు యాజమాన్యాలలో వివిధ నామాలతో చలామణి అవుతున్నా అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలన్నిటిని ఒకే గొడుగు కిందికి చేర్చి కామన్ స్కూల్ విధానం శాస్త్రీయ విద్యా విధానం కొరకు పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీపి వెంటనే అమలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగంలో పాత ప్రభుత్వాలు చేసిన విధ్వంసాలను సరి చేయవలసింది పోయి కొత్త ప్రభుత్వం మరిన్ని కొత్త సమస్యలను కొని తెచ్చిపెడుతుందని వాపోయారు. పాఠశాలలను పర్యవేక్షణ చేయడానికి ఉపాధ్యాయ బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు దిగజారి పోయే ప్రమాదం ఉందని కావున వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రైవేట్ వైద్యులను సంప్రదించకుండా నేరుగా ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య సేవల కోసం రావాలని మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకరేంద్రం వైద్యాధికారి సీహెచ్ మహేందర్ గ్రామస్థులకు సూచించారు. సోమవారం మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన హెల్త్ క్యాంపు లో 50 మంది గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. గ్రామాల్లో ఆర్ఎంపీల వద్ద తెలిసీతెలియని వైద్యసేవలు పొంది ఇబ్బందులు పడకుండా నేరుగా దగ్గర్లోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రావాలని సూచించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం సూచించిన మందులనే వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ రఘు, ఏఎన్ఎం నిర్మల, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

చిన్నకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ రంగనాయక స్వామి గుట్టపై సోమవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సుమారు 70 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచారించారు. జడ్పీ మాజీ చైర్ పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ దంపతులు వ్రతాన్ని ఆచారించి మాట్లాడారు. లక్ష్మీ రంగనాయక స్వామి, సత్యనారాయణ స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖఃసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.


సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచారిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ దంపతులు తదితరులు

మందుబాబులకు షాక్

● ఇద్దరికి జైలు, 9 మందికి జరిమానా

గజ్వేల్ రూరల్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో పలు ప్రాంతాలలో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో 11 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ముందు హాజరుపరచగా, మెజిస్ట్రేట్ విచారణ జరిపి ఇద్దరికి జైలు శిక్ష 9 మందికి కలిపి మొత్తం రూ. 90000.00 జరిమానా విధించారు.ఈ సందర్భంగా సీఐ మురళి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రతిరోజు తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రూ. జరిమానా, జైలు శిక్షలు పడుతున్నందున ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆయన హెచ్చరించారు.

సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన

● ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం చైర్మన్ సీహెచ్ గంగాధర్

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చదవుతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శీతాకాల శిబిరాన్ని ప్రిన్సిపాల్ గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతబావం పెంపొందించేందుకు జాతీయ సేవా పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ టి రణధీర్‌కుమార్, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి అరుణాదేవి, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ ఎం రేణుక,అధ్యాపకులు బి ఎల్లయ్య, పి చందు, అశోక్ తదితరులు ఉన్నారు.



గాంధీనగర్‌లో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం చైర్మన్ గంగాధర్

మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి

ములుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ కోరారు. మండలంలోని పాఠశాలల్లో సమస్యలు సేకరిస్తూ ఈ విజ్ఞప్తి చేశారు. బిల్లులు ఆలస్యంగా రావడం, మెనూ ఖర్చులు పెరగడం, వంట కార్మికుల హెచ్చరికలు, అధికారుల ఒత్తిళ్లతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వంట బిల్లులు, కార్మికుల గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లెట్ కాన్ఫరెన్స్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని నారాయణ హైస్కూల్లో విద్యార్థి కేంద్రీకృత విద్యకు నూతన నాందిగా స్టూడెంట్ లేట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జీఎం గోపాల్ రెడ్డి, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం చైతన్య రావు ,ఆర్ఐ సత్యంరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ రమ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ పరశురాములు, వైస్ ప్రిన్సిపాల్ వైష్ణవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామస్వామి మృతి పట్ల హరీశ్ రావు సంతాపం


రామస్వామి(ఫైల్)

సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన రిటైర్డ్ వార్డెన్, ఉమ్మడి మెదక్ జిల్లా మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎటి రామస్వామి అకాల మృతి పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం తెలిపారు.. రామస్వామి మృతి బాధాకరమని, ఆయన సామాజిక సేవకు నిరంతరం పాటుపడ్డారని, ఉమ్మడి మెదక్ జిల్లాలో మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు తాను అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎంఆర్‌పీఎస్ తొలి తరం ఉద్యమ నాయకుడిగా, దళిత సంఘాల ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా పని చేశారన్నారు. రామస్వామి కుటుంబానికి హరీష్‌రావు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కొమురవెల్లి ఎస్సైగా మహేష్

కొమురవెల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి):కొమురవెల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా టి.మహేష్ సోమవారం రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ.. అందరికి అందుబాటులో ఉంటూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఎస్సైకి పలువురు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

ఇటుకబట్టీ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

● స్టేషన్ ఎదుట ముస్త్యాల రైతుల ఆందోళన


స్టేషన్ ముందు ఆందోళనకు దిగిన ముస్త్యాల రైతులు

చేర్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రోడ్డును ధ్వంసం చేస్తున్న ఇటుక వ్యాపారిపై చర్యలు తీసుకోవాలంటూ చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామ రైతులు పోలీసు స్టేషన్ ఎదుట ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై గ్రామ రైతులు రాము, వెంకటయ్య, మాట్లాడారు. ఇటుకవ్యాపారి చల్ల రామకృష్ణ మా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే నర్సాయపల్లి మట్టి రోడ్డును పాడుచేస్తుండటంతో అడిగితే భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

సీసీ రోడ్ల పనులకు శంఖుస్థాపన


శంఖుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజులరాజనర్సు

సిద్దిపేట నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు సోమవారం సిద్దిపేట పట్టణంలోని 3వ వార్డు రంగధాంపల్లిలో నూతన సీసీ రోడ్డు పనులను సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజులరాజనర్సు శంఖుస్థాపన చేశారు.

కాంగ్రెస్, బీజేపీలకు బీటీమ్‌గా కవిత

-బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి


వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బీటీమ్‌గా మారారని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నేతలైన హరీశ్‌రావు, కేటీఆర్‌లపై కవిత చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కవిత తెలంగాణ ఉద్యమనేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె అయినందున ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆమెను గౌరవించారని, బీఆర్ఎస్ పార్టీ ఆమెకు గౌరవప్రదమైన పదవులు ఇచ్చి గౌరవించిందని అన్నారు. కానీ, నేడు ఆమె చేస్తున్న రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. తిన్నింటి వాసాలు లెక్క పెట్టే విధంగా కవిత విధానం ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో కుమ్మక్కై ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీపై బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావుపై పసలేని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 54 మంది విద్యార్థులకు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కించుకున్నారు. అక్టోబర్‌లో ముంబాయ్ సంస్థ ఆన్‌లైన్ ద్వారా చిత్రలేఖనం, కలర్స్, ఆర్ట్స్ తదితర విభాగాల్లో సాంఘీక సంక్షేమశాఖ గురుకుల విద్యార్థులు ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల ఫలితాలు వెలువరించగా జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమశాఖ గురుకులంకు చెందిన 54 మంది విద్యార్థులకు అవార్డు దక్కించుకున్నారు. అలాగే విద్యార్థుల నైపుణ్యాన్ని తీర్చిదిద్దిన ఆర్ట్ టీచర్ దినేష్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ వైబి శ్యామలత, గురుకుల పాఠశాలకు అవార్డులు అందినట్లు పీడి దినేష్ తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీకి సన్మానం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హౌసింగ్ బోర్డు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నేతి కైలాసం మాట్లాడుతూ పేద వైశ్యుల అభ్యున్నతికోసం పట్టణ వైశ్య సంఘం పనిచేస్తుందని అన్నారు. పట్టణంలోని వార్డులకు కమిటీలు వేసి త్వరలో అందరి వివరాలు సేకరించి, ఒక ప్రణాళిక బద్ధంగా అందరి అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు.

స్వర్ణనిధి డిపాజిట్ పథకంతో అనేక లాభాలు

దౌల్తాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీలో స్వర్ణనిధి డిపాజిట్ పథకంతో అనేక లాభాలు ఉన్నాయని బ్రాంచ్ మేనేజర్ ఎల్లయ్య అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో సహకార వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు స్వర్ణనిధి డిపాజిట్ పథకం సద్వినియోగం చేసుకొని తద్వారా అధిక వడ్డీ పొందాలని అన్నారు. బ్యాంకులో అతి తక్కువ వడ్డీకి గృహ నిర్మాణ, ఉన్నత విద్య, వాహన, వాణిజ్య తదితర రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

పత్తి రైతుకు తీరని కష్టాలు

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులు తమ ఏజెంట్లను రంగంలోకి దింపి, తక్కువ ధరలకు పత్తి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తూకం, ధరల్లో మోసం చేసే అవకాశాలు లేకపోలేదని రైతులు భయపడుతున్నారు. రైతులు, రైతు సంఘాలు ధాన్యం కొనుగోళ్ల మాదిరిగానే, పత్తిని కూడా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



బెజ్జంకిలో తెరుచుకొని జిన్నింగ్ మిల్లు

కూలీలు దొరకడం లేదు

కొద్దిరోజులక్రితం వరకు వర్షాలు కురవడంతో పత్తి ఏరలేదు. ఇటీవల వర్షాలు తగ్గినా ధాన్యం విక్రయాలతో పాటు వ్యవసాయ పనుల కారణంగా కూలీలు దొరకడం లేదు. పొరుగు మండలాలకు చెందిన కూలీలను పనికి పిలిస్తే ఆటో కిరాయి, కూలీతో పాటు సేకరించిన పత్తికి కిలోకు రూ.20చొప్పున ఇవ్వాలని చెబుతున్నారు. ఒకవేళ విధిలేక ఇస్తామఘన్నా సమయానికి రావడం లేదు.

- బీర్ల మహేశ్, చేర్యాల

చర్చలు సఫలమైతే యథావిధిగా కొనుగోళ్లు

జిన్నింగ్ మిల్లులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నాయి. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, ఉన్నతాధికారులు జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు పూర్తయిన వెంటనే కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభమవుతాయి

-నాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

విద్యార్థులకు సైకిళ్ల పంపిణి

బెజ్జంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మోదీ కానుకగా అందజేస్తున్న సైకిళ్లను సోమవారం మండలంలోని వడ్లూరు బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు బీజేపీ నాయకులు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, మండల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల ఇబ్బందులు తొలగించాలి

● ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి సాగుచేసిన పత్తి అకాల వర్షాలకు తీవ్రంగా రైతులు నష్టపోయారని, పండించిన కాస్తోకూస్తో పత్తిని సీసీఐ ద్వారా అమ్మకానికి తెచ్చిన రైతులను సీసీఐ అధికారులు అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని పత్తి రైతులను ఇబ్బందులు తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎసస్ నాయకులు కోరారు. సోమవారం పత్తి రైతుల సమస్యలు తీర్చాలని బీఆర్ఎస్ నియోజక వర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో ఆర్డీవో రాంమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్‌రెడ్డి మాట్లాడారు. పత్తి కొనుగోళ్లలో కొన్ని నిబంధనలు సవరించి రైతులు పత్తిని అమ్ముకునే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో పత్తి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయక పోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం


సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు పనులు చక చక జరుగుతున్నాయి. గద్య నిర్మాణం పూర్తయిన వెంటనే విగ్రహ ప్రతిష్ఠకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

-జిల్లా స్టాఫ్ ఫోటో గ్రాఫర్